

ఆర్‌యూ అభివృద్ధికి కృషి చేస్తా

- రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్



కర్నూలు అర్బన్, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన వర్సిటీలో రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ సొంత జిల్లాలో యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌గా రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.



వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు

రామాయణాన్ని ఆదర్శంగా తీసుకోండి : కలెక్టర్

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 17 ఆంధ్రజ్యోతి : వాల్మీకి రచించిన రామాయణ మహాకావ్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న మహాకవి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకుంటున్నామన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని అందరి సమక్షంలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమీషనర్ నిరంజన్‌రెడ్డి, బిసి సంక్షేమ శాఖ అధికారి ముస్తఫా అహ్మద్ తదితరులు వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.



నందికొట్కూరులో కోత దశలో ఉన్న మొక్కజొన్న పొలంలో నిలిచిన వర్షపు నీరు

నీటమునిగిన పొగాకు పంట



వడ్డెమాను గ్రామంలోని సచివాలయం చుట్టూ చేరిన వర్షపు నీరు



రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నె వద్ద పొంగి ప్రవహిస్తున్న వక్కిలేరు



అతలాకుతలం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వణికిపోతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయయి. పంట పొలాలు నీటమునిగాయి. మొక్కజొన్న, వరి, పంట పంటలు దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులు, కల్వర్టులు పూర్తిగా నాశనమయ్యాయి. నందికొట్కూరు పట్టణంలో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాగలమర్రి మండలంలోని బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, వక్కిలేరు వంతెనలపై వరద ఉధృతి తగ్గలేదు. దీంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించి పోయాయి. అలాగే ఎనిమిది మట్టిమిద్దెలు కూలాయి. రుద్రవరం మండలంలోని ఎర్రగుడిదిన్నె, చిలకలూరు గ్రామాల వద్ద వక్కిలేరు వాగు పొంగి ప్రవహించింది. రాకపోకలు నిలిచిపోయాయి. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మిగతా 6వ పేజీలో...

● నాలుగు రోజుల నుంచి తడుస్తోంది



నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న ధాన్యం తడుస్తోంది. ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మొక్కజొన్న పంటను కోసి ధాన్యాన్ని కల్లానికి తీసుకు వచ్చాను. వచ్చిన నాటి నుంచి వర్షం కురుస్తోంది. రోడ్డుపై పోయడంతో టార్పాలిన్ పట్టాలు సహితం తడిసి మొక్కజొన్నకు ఫంగస్ వస్తోంది. అలాగే మరో రెండు రోజులు ఉంటే పంట మొత్తం దెబ్బతినే అవకాశం ఉంది.

- వహీద్ మియా, దామగట్ల, నందికొట్కూరు మండలం

నందికొట్కూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బుధవారం రాత్రి వర్షం కురవడంతో నందికొట్కూరు మండలంలో 75.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. గత రాత్రి కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంట నీటి పాలైంది. బుధవారం రాత్రి, గురువారం ఉదయం కురిసిన వర్షాలకు నందికొట్కూరు, పగిడ్యాల, మిడ్తూరు మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. ముఖ్యంగా నందికొట్కూరు మండలంలోని వడ్డెమాను, అల్లూరు, కోనేటమ్మపల్లె, నందికొట్కూరు పొలిమేరలో వేసిన మొక్కజొన్న పంట పొలాల్లో వర్షపు నీరు చేరింది. దీంతో కోత దశలో ఉన్న మొక్కజొన్న పంట చేతి వస్తుందో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కోత కోసి కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడుస్తుండడంతో మొలకలు వస్తోంది. దామగట్లకు చెందిన రైతులు జాతీయ రహదారి 340-సీపై ఆరబెట్టుకున్నారు. ఎకరాకు రూ.40 వేల పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే కోత దశలో వర్షం కురవడంతో పంట చేతికి వస్తుందో లేదోనన్న భయాందోళనలో రైతులు ఉన్నారు. వడ్డెమాను గ్రామంలో కోత దశలో ఉన్న ఉల్లి పంట నీట మునిగింది. వడ్డెమాను అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వర్షపు నీరు చేరుకుంది. వడ్డెమాను హైస్కూల్‌లో నిలిచిన నీటిలో వెళ్లి విద్యార్థులు అన్నం పెట్టించుకుని భోజనం చేశారు.



నందికొట్కూరులో జలమయమైన లోతట్టు ప్రాంతాలు

- తుఫాను దెబ్బకు మొక్కజొన్న రైతు కుదేలు
- నందికొట్కూరులో 75.8 మి.మీ. వర్షపాతం నమోదు
- కల్లాల్లో తడుస్తున్న ధాన్యం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- వర్షాలకు మిషన్లు పొలాల్లోకి దిగలేని పరిస్థితి



నమ్మండి.. ఇది బస్టాండ్..!

చాగలమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి ఆర్టీసీ బస్టాండులో వర్షం పడితే చాలు సమస్యలు మొదలవుతాయి. కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా బస్టాండ్ ఆవరణం బురదమయంగా మారుతోంది. దీనికి తోడు రహదారులు కూడా సరిగ్గా లేకపోవడం గుంతలమయం కావడంతో బస్సుల రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బస్టాండ్ ఆవరణ మొత్తం చిత్తడిమయంగా మారింది. చాగలమర్రి బస్టాండు నుంచి కర్నూలు, కడప, నంద్యాల, ఆళ్లగడ్డ, ప్రొద్దుటూరు, తిరుపతి తదితర ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. రాత్రి వేళల్లో బస్టాండు ప్రాంగణం చీకటిగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



బురదమయంగా మారిన బస్టాండుకు వెళ్లే దారి

తమ్ముళ్లపై దృష్టి..!



- నాయకుల పని తీరుపై అధిష్టానానికి ఫిర్యాదులు
- ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితో అధినేత చంద్రబాబు నేడు భేటీ

నంద్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారు చేస్తున్న అక్రమాలు, అకృత్యాలకు విసిగిపోయి జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కూటమికి పట్టం కట్టారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడుపుతామని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు. ఆ మేరకు దృష్టి సారించాలని కూటమి ఎమ్మెల్యేలను ఆదేశించారు. అధినేత చంద్రబాబు చెప్పిన మాటలు నియోజకవర్గ స్థాయి నాయకులు జవదాటరని, వైసీపీ ప్రభుత్వంలో పడిన ఇబ్బందులు తొలగిపోతాయని భావించారు. తమ వన్నీ వట్టి భ్రమలేనన్న విషయం ప్రజలు తెలుసుకోవటానికి గట్టిగా మూడు నెలలు కూడా పట్టలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కాకముందే కొన్ని నియోజకవర్గాల్లోని నాయకులు చేస్తున్న అరాచకాలకు వైసీపీ పాలనే కాస్త మేలు అనే స్థాయిలో ఆయా నియోజకవర్గాల నాయకులు ప్రవర్తిస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. వీటికి సంబంధించిన నివేదికలను ఎప్పటికపుడు పార్టీ అధినాయకత్వం తెప్పించుకుంటున్నట్లు సమాచారం. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్యేలతో నిర్వహించే సమావేశం ప్రధానంగా ఆయా నియోజకవర్గాల నాయకుల తీరుపైనే సాగబోతున్నట్లు తెలుస్తోంది.

● **అన్నింటా:** ప్రజలు తమను గెలిపించింది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి ఇచ్చిన లైసెన్సులా కొన్ని నియోజకవర్గాల నేతలు భావిస్తున్నట్లుంది. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తర్వాత నుంచి వారు ప్రవర్తిస్తున్న తీరును పరిశీలిస్తే ఈ విషయం ఇట్టే తెలిసిపోతుందని ఆయా నియోజకవర్గ ప్రజలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. మొన్నటి వరకు సాగిన అధికారుల బదిలీల ప్రక్రియలో ఒకటి రెండు నియోజకవర్గాల్లో మినహాయించి అన్ని చోట్ల ఆయా ప్రజాప్రతినిధుల మార్క్ అడుగడుగునా కనిపించింది. ఆ తర్వాత ఉచిత ఇసుకలోనూ కొంతమంది నాయకులు చేతులు, కాళ్లు పెట్టారు. ఇక ఆ తర్వాత మద్యం వ్యవహారంలో కొంతమంది సిండికేట్‌గా మారటం, బయటి వారిని దరఖాస్తులు వేయనివ్వకుండా బెదిరించటం వంటివి చేశారు. ఇక మద్యం దుకాణాలను దక్కించుకున్న వారిని సైతం తమకు వాటా కావాలంటూ బెదిరించిన ఘటనలు కూడా ఉన్నాయి. అయితే వీటన్నింటినీ ఎప్పటికపుడు అధికారుల ద్వారా, ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా అధిష్టానం సమాచారం తెప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల మద్యం దుకాణాన్ని దక్కించుకున్న ఓ దుకాణాదారుడికి రాష్ట్ర స్థాయి అధికారి ఫోన్ చేసి 'వైసీపీ వారి మాదిరిగానే ప్రస్తుత కూటమి నాయకులు దరఖాస్తు వేయవద్దని గానీ, లాటరీ తగిలిన తర్వాత మద్యం దుకాణంలో వాటా ఇవ్వమని గానీ అడిగారా?' అంటూ ఫోన్ చేసి ఆరా తీసినట్లు సమాచారం. దీనిని బట్టి అధిష్టానం ప్రజాప్రతినిధులపైన ఓ కన్నేసి ఉంచిందని, ప్రతి విషయాన్ని గమనిస్తోందన్న విషయం తేటతెల్లమవుతోంది.

మిగతా 6లో...

డోన్ సీఐ దాడిపై టీడీపీ సీరియస్

- శ్రీనివాసులు యాదవ్‌ను పరామర్శించిన జిల్లా అధ్యక్షుడు
- ఘటనపై ఆరా తీసిన సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ 7
- హోంమంత్రిని కలిసి ఫిర్యాదు చేసిన న్యాయవాదులు

సజ్జల డ్రామాలు ఇక ఆపాలి



- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు 7

దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు

- దశలవారీగా హామీల అమలు
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు మహిళలకు ఉచిత సిలిండర్లను పంపిణీ చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడించారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక దశలవారీగా హామీలను అమలు చేస్తున్నామన్నారు. గురువారం బనగానపల్లె మండలంలోని కైప గ్రామంలో పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా రూ.1.80 కోట్లతో కైప- సంకలాపురం గ్రామాల మధ్య సీసీ రోడ్డు, బీటీరోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి బీసీ మాట్లాడుతూ వర్షకాలంలో కైప సంకలాపురం గ్రామాల మధ్య దశాబ్దాల కాలంగా నడవాలంటేనే నరకప్రాయంగా ఉండేదన్నారు. అందుకే ప్రత్యేకంగా నిధులు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. వైసీపీ పాలనలో తట్టెడు మట్టి వేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనమైందన్నారు. ఇక జన్మలో వైసీపీ అధికారంలోకి రాదన్నారు. వైసీపీ నేతలు ఇంకా పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.



కైప గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి


తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో ప్రతిభ

చాగలమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న యశ్వంత్.. పుస్తక సమీక్ష పోటీల్లో తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో ప్రతిభ కనబరిచాడు. ప్రకాశం జిల్లా కంభంకు చెందిన ఊరిమల్ల ఫౌండేషన్, అక్షరాల తోవ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 6వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్షలో విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచాడు. తెలుగు ఉపాధ్యాయిని ఎం. నాగేశ్వరమ్మ ప్రోత్సాహంతో విద్యార్థి యశ్వంత్ నీతి కథలు అనే పుస్తకంపై సమీక్ష రాశాడు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కాత్యాయని, ఉపాధ్యాయులు విద్యార్థి యశ్వంత్‌ను అభినందించారు.



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పూర్తిగా నిండిన శ్రీశైలం డ్యాం



శ్రీశైలం, అక్టోబరు 17: శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి గురువారం చేరుకుంది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 59,936 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 21,555 క్యూసెక్కులు మొత్తం 81,491 వరద నీరు వచ్చింది. గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 79,536 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తిస్థాయి నీటిమట్టం 884.50 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 212.9198 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,876 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,900 క్యూసెక్కులు మొత్తం 67,776 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

ఆహ్లాదం

నగర నందన వనం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

నగర వనం ఆనందం పంచుతోంది. ప్రకృతి ప్రియులకు ఆహ్లాదం అందిస్తోంది. ఒత్తిళ్లతో కూడిన జీవనం గడుపుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇక్కడి వాతావరణం ప్రశాంతత కలిగిస్తోంది. నగరవాసులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు జిల్లా అటవీ శాఖ నడుం బిగించింది. సరిగ్గా ఏడేళ్ల క్రితం నగర సరిహద్దు ప్రాంతమైన గార్గేయపురం సమీపంలో సహజ సిద్ధమైన వాతావరణంలో ప్రకృతి రమణీయత నడుమ నగర వనానికి రూపకల్పన చేశారు. దాదాపు 5 కి.మీ. విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. సందర్శకుల ఆసక్తి, ఆలోచనలకు అనుగుణంగా పలు ప్రాంతాలను తీర్చిదిద్దారు. వనం మొత్తం చుట్టి రావాటానికి వనదర్శిని పేరుతో ప్రత్యేకంగా రెండు వాహనాలను ఏర్పాటు చేశారు. ఎంతో ఎత్తులో నిర్మించిన వాచ్ టవర్‌పై నుంచి పరిసరాలను పరిశీలిస్తే విహంగ వీక్షణం చేసినంత భావన కలుగుతుంది. ఇక్కడి నుంచి చూస్తే వనంతో పాటు సమీపంలోని తుంగభద్ర నది సైతం ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. సందర్శకులు భోజనం చేయడానికి, సేద దీరేందుకు కుటీరం ఆకృతిలో పలు చోట్ల పగోడ పేరుతో ప్రత్యేక నిర్మాణాలు ఏర్పాటు చేశారు. కుటుంబం సభ్యులు, స్నేహితులతో ఈ ప్రాంతాన్ని సందర్శించిన వారికి ఆనందానికి కొదువ ఉండదంటే అతిశయోక్తి కాదు. అన్ని వయస్సుల వారు ఆడుకునేందుకు ఆట వస్తువులను బిగించారు. యోగా చేసుకునేలా ధ్యాన కేంద్రం అందుబాటులో ఉంచారు. విద్యార్థులు అధ్యయన యాత్రల పేరుతో ఇక్కడికి వచ్చిన యెడల వారి సౌలభ్యం కోసం పవర్ ప్రజంటేషన్ చేసుకునేందుకు అనుకూలంగా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. గార్గేయపురం చెరువుకు సమీపంలోని వనంలో అంతర్భాగంగా సహజంగా వెలిసిన రాతిగుండు చూపరులను విశేషంగా అకట్టుకుంటోంది. దీనికి పిల్లిగుండుగా నామకరణం చేశారు. దీనిపై నుంచి కూడా చుట్టుపక్కల పరిసరాలను వీక్షించవచ్చు.









సెలవుల్లో సందడే సందడి

రూ.40 రుసుంతో నగర వనం సందర్శనకు అనుమతిస్తారు. నగర వనాన్ని వాహనంలో చూడాలంటే ఒక్కో వ్యక్తికి రూ.75 చొప్పున వసూలు చేస్తారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బోటింగ్‌కు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. సాధారణ రోజుల్లో ఓ మోస్తరుగా ఉండే సందర్శకులు, సెలవు దినాల్లో కిక్కిరిసి ఉంటారు. ఇక పాఠశాల, కళాశాలల సెలవు రోజుల్లో ఈ తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది.




ప్రకృతి ప్రియులకు ఆహ్లాదం పంచుతున్న వైనం

సెలవుల్లో సందర్శకుల తాకిడి

మరిన్ని ప్రత్యేకతలు

కుటుంబ సమేతంగా, సామూహికంగా విహారానికి వచ్చినప్పుడు ప్రత్యేకించి భోజనం చేసేందుకు రాతి మహల్‌ను నిర్మించారు. నగర వనప్రవేశ ద్వారానికి ఆనుకుని గార్గేయపురం చెరువు ఉంది. ఇక్కడ బోటింగ్ ఆనందంతోపాటు మరపురాని అనుభూతిని అందిస్తోంది. వేసవి కాలంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వలస పక్షులు, నెమళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఫొటో షూట్‌లు, పుట్టిన రోజు, కార్యాలయ కార్యక్రమాలు, పాఠశాల వేడుకలు చేసుకునేందుకు సైతం అధికారికంగా అనుమతి ఇస్తున్నారు. వన సందర్శనకు వచ్చే వారి సౌకర్యార్థం క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఔషధ మొక్కలతో ఉద్యానవనాన్ని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



5వ పేజీ తరువాయి

తెలుగు తమ్ముళ్లపై దృష్టి..!

ప్రజలతో మమేకమవ్వాలని, నియోజకవర్గ స్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకూడదని, వైసీపీ మాదిరే చేస్తామంటే కుదరదని టీడీపీ అధినేత ఎప్పటికపుడు చెబుతూనే ఉన్నారు. అయినా కొన్ని నియజకవర్గాల్లోని నాయకులు అధినేత మాటను చెవికెక్కించుకోలేదు. దీనికి తోడు పార్టీ కోసం పని చేసిన వారిని దగ్గరకు రానివ్వకుండా, వైసీపీతో తిరిగిన వారినే దగ్గరకు తీస్తున్నారన్న అసంతృప్తి కింది స్థాయి నాయకుల నుంచి వ్యక్తమవుతోంది. ఉద్యోగుల బదిలీల్లో ఇది స్పష్టంగా కనిపించిందన్నది బహిరంగ రహస్యమే! ఇక కూటమి వారు ఏదైనా పని కోసం వెళ్లినా, పలకరించడానికి వెళ్లినా సరైన గౌరవం దక్కటం లేదని, డబ్బులు ముట్టజెప్పే పనులు ఎవరైతే తీసుకు వస్తారో వారికే మేలు చేకూరుతుందన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఇక కొన్ని చోట్ల ప్రజా ప్రతినిధుల కంటే, వారి కుటుంబ సభ్యుల పెత్తనమే ఎక్కువగా సాగుతోందన్న ఆరోపణలు, విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. వెరసి ఇలాంటి ప్రజా ప్రతినిధులు సాగిస్తున్న మితిమీరిన వ్యవహార శైలి మీద ఆయా నియోజకవర్గాల్లోని కిందిస్థాయి కార్యకర్తలు, పార్టీ అభిమానుల అధిష్ఠానానికి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఇలా ఆరోపణలు, అందుకుంటున్న వారితో సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చే పనులను సీఎం చంద్రబాబు సహించరని, కాబట్టి నాయకులకు తలంటడం ఖాయమన్న అభిప్రాయం వినిపిస్తోంది.

డాక్టర్ గోవిందరెడ్డికి అవార్డు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై అవగాహన, మరణానంతరం నేత్రాల సేకరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డా. కేజీ గోవిందరెడ్డి చేసిన విశేష సేవలకు ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ విశిష్ట అవార్డును అందజేసింది. ఈ మేరకు ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ వ్యవస్థాపకుడు డా. జీఎన్‌రావు నుంచి హైదరాబాదులో రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డా. కేజీ గోవిందరెడ్డి అవార్డు, మెమెంటో అందుకున్నారు. గత 20 సంవత్సరాలుగా రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఐ బ్యాంకు ద్వారా డా. గోవిందరెడ్డి నేత్రదాన సేకరణ, అవగాహన 1.50 లక్షల మందితో నేత్రదానం ఇవ్వడానికి అంగీకారం తెలిపేలా కృషి చేశారు. అలాగే 2005 నుంచి నేత్రదానంపై ఆయన పని చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ అవార్డుతో సత్కరించింది.



డా. గోవిందరెడ్డికి మెమెంటో అందజేస్తున్న ఎల్‌వీ ప్రసాద్, ఐ హాస్పిటల్ వ్యవస్థాపకుడు డా.జి.ఎన్ రావు



అక్షరాస్యతతోనే మానవ వనరుల అభివృద్ధి

● కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతతోనే మానవ వనరుల అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉల్లాస్ కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి కన్వర్జెన్స్ కమిటీ సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యతను రూపుమాపేందుకు చర్యలు చేపట్టనున్నామన్నారు. ప్రతి గ్రామంలో 50 ఏళ్లలోపు ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదవడం, రాయడం నేర్పించాలని సూచించారు. ప్రతి సచివాలయ ఉద్యోగి సామాజిక బాధ్యతతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఐదు నుంచి పది మంది నిరక్షరాస్యులను ఎంపిక చేసుకుని చదువు చెప్పేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. తరగతుల నిర్వహణకు అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. అక్షరాస్యతా తరగతులు సక్రమంగా నిర్వహించేలా పంచాయితీ సెక్రటరీలు, ఈవోపీఆర్డీలు, ఎంపీడీవోలు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, వయోజన విద్యాశాఖ డీడీ చంద్రశేఖర్ రెడ్డి, డీఈవో శామ్యూల్, డీపీవో భాస్కర్, సమాచార శాఖ ఉప సంచాలకులు జయమ్మ, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్ పాల్గొన్నారు.

జయహో..నారసింహా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నరసింహస్వామి క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న అహోబిలం నరసింహ స్వామి పవిత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం దిగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, నవకలశ తిరుమంజనం సేవను నిర్వహించారు. ద్వారాతోరణం, మండల, కుంభ, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ఎదురుగా హోమ మండపాన్ని ఏర్పాటు చేసి హోమం, పూర్ణాహుతి, మంగళహారతి నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సమూర్తులను విశేషంగా అలంకరించి తిరువీధుల్లో కన్నులపండువగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్‌లు పర్యవేక్షించారు.

వాల్మీకిని స్మరించుకున్న పోలీసులు



వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి సందర్భంగా నంద్యాల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం నివాళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి గొప్ప మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే రామాయణ మహాకావ్యాన్ని రచించి సమాజానికి అందించాడని అన్నారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ మంజునాథ్, నాగభూషణం, కార్యాలయ సిబ్బంది పాల్గొని వాల్మీకి మహర్షికి నివాళి ప్రకటించారు.

వీడని వర్షం



బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు



రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నె సమీపంలో నీట మునిగిన జొన్న పంట



నీట మునిగిన పొగాకు పంట

చాగలమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. గురువారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. 26.2 మీ.మీ. వర్షపాతం నమోదైంది. బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, వక్కిలేరు వంతెనలపై వరద ఉధృతి తగ్గలేదు. దీంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించిపోయాయి. చాగలమర్రి సమీపంలోని అడ్డవాగు పొంగి ప్రవహించి పంటలు నీట మునిగాయి. నగల్లపాడు, డి.వనిపెంట గ్రామాల్లో పిడుగు పాటుకు చెట్లు విరిగి పడ్డాయి. నగల్లపాడు సమీపంలోని దర్గా వద్ద పిడుగు పడటంతో చెట్టు చీలి గండి పడింది. సర్వీసు రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం తడిచి మొలకలు రావడంతో కౌలు రైతులు భారీగా నష్టపోయారు. చాగలమర్రి, తోడెండ్లపల్లె, మల్లేవేముల గ్రామాల్లో ఎనిమిది మట్టిమిద్దెలు కూలాయి. గృహాల్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. ఆస్తి నష్టం సంభవించింది. మట్టి మిద్దెలు, పంట నష్టం అంచనా వేసి పరిహారం అందించాలని బాధిత కుటుంబీకులు, రైతులు కోరుతున్నారు. చాగలమర్రిలోని నాగులకట్ట వీధికి చెందిన జింక ఉసేన్‌వలి మట్టి మిద్దె కూలింది.

రుద్రవరం : రుద్రవరం మండలంలో ఐదు రోజులుగా కురుస్తున్న తుఫానుకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం మండలంలోని ఎర్రగుడిదిన్నె, చిలకలూరు గ్రామాల వద్ద వక్కిలేరు వాగు పొంగి ప్రవహించింది. పేరూరు గ్రామ సమీపంలో ఇదే పరిస్థితి నెలకొంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎర్రగుడిదిన్న, మాకినేనిపల్లె, అలమూరు, తిప్పారెడ్డిపల్లె, ఇంకా పలు గ్రామాల్లోని పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ చేరి పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాను వర్షం ధాటికి మొక్కజొన్న రైతులు కుదేలయ్యారు. వేలాది క్వింటాల్లో మొక్కజొన్నలు దెబ్బతిన్నాయి. ఆలమూరులో 700 క్వింటాళ్ల ఎండుమిర్చి తడిసిపోయి దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పగిడ్యాలలో 40. 6 మి.మీ. వర్షపాతం నమోదు

పగిడ్యాల: అల్పపీడన ప్రభావంతో మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున వర్షం కురిసింది. వర్షానికి పంట పొలాలల్లో వర్షం నీరు నిలబడింది. ఆయా గ్రామాల్లో ఆరబోసుకున్న మొక్కజొన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు పట్టాలను కప్పి ఉంచారు. మండలంలో 40.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.



చాగలమర్రిలో మల్లె తోటలో నిలిచిన వర్షపు నీరు



డి. వనిపెంటలో పిడుగుపాటుకు నేలకొరిగిన వందేళ్ల చింతచెట్టు



ఓర్వకల్లులో జ్యోతులతో కళాకారులు

వైభవంగా చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు

ఓర్వకల్లు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో వెలసిన చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవాలు గురువారం తెల్లవారుజామున అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను తొగట వీరక్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. అర్చకులు రామకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. నందికోల సేవ, ఖడ్గ సేవ, చెక్క భజన వంటి సాంప్రదాయ నృత్యాలు, కీలుగుర్రం, గొరవయ్యల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులు కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. 25 జ్యోతులతో కళాకారులు నృత్యాలు చేస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గోవిందరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, రంగనాథగౌడు, కురువ పెద్దయ్య, గ్రామ ప్రజలు పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



చౌడేశ్వరి దేవి



కత్తి సేవ చేస్తున్న తొగట వీర క్షత్రియ సంఘం సభ్యులు


మద్యం నిల్వలు ఫుల్

- బారులు తీరిన లైసెన్స్‌దారులు
- మూడు రోజుల్లో రూ.13.32 కోట్ల వ్యాపారం
- ఇంకా తెరుచుకోని 19 షాపులు
- నాయకుల నుంచి తప్పని బెదిరింపులు
- బెల్టు షాపుల కోసం పోటా పోటీ



డిపోలో నిల్వ ఉంచిన మద్యం

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం 99 మద్యం దుకాణాలకు లైసెన్సులను లాటరీ ద్వారా మంజూరు చేసింది. లైసెన్సు దక్కించుకున్న వారందరూ బుధవారం నుంచి దుకాణాలను ప్రారంభించారు. తమకు అవసరమైన సరుకును నిర్దేశిత ఐఎంఎల్ డిపో నుంచి మంగళవారం నుంచే తీసుకెళ్తున్నారు. దుకాణాల నుంచి వచ్చిన ఇండెంట్ల ఆధారంగా కర్నూలు నగరంలోని ఐఎంఎల్ డిపో నుంచి మూడు రోజుల్లో సుమారు రూ.13.32 కోట్ల విలువైన మద్యాన్ని వ్యాపారులు తీసుకెళ్లారని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో ప్రైవేట్ మద్యం దుకాణాలు అందుబాటులోకి వస్తే ప్రభుత్వం ఖజానాకు కోట్లలో ఆదాయం సమకూరుతుంది. గత ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జే బ్రాండ్లకు బై..బై చెబుతూ గతంలో ఆదరణ పొందిన ప్రముఖ బ్రాండ్ల బాజా మోగింది. జిల్లా వ్యాప్తంగా 19 మద్యం దుకాణాలు తెరుచుకోలేదు. కొన్ని ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు షాపులు దొరకక ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ఉన్నారు. క్వార్టర్ బాటిల్ రూ. 99కే విక్రయిస్తామని ప్రకటించిన మేరకు కాకుండా క్వార్టర్ రూ. 150 పైబడి ఉన్న మద్యంనే దుకాణాల్లో అమ్మకాలు సాగిస్తున్నారని పలువురు మందుబాబులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రముఖ బ్రాండ్లు ఐబీ, ఆర్‌సీ, రాయల్ స్టాగ్, బ్లెండర్స్ ప్రైడ్, కేఎఫ్‌లతో పాటు అన్ని కంపెనీల మద్యం అందుబాటులో ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



డిపో నుంచి వాహనాల్లో తరలిస్తున్న మద్యం

● లైసెన్స్‌దారులకు బెదిరింపులు..

మద్యం దుకాణాల లైసెన్సు పొందిన వారు ఇంకా ప్రారంభించుకోలేని పరిస్థితులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 19 మద్యం షాపులు తెరుచుకోవడానికి ముందుకు రావడం లేదు. ఆయా ప్రాంతాల్లో షాపులు తెరుచుకునేందుకు వారికి అద్దె గదులు దొరక్కుండా చేయగామరి కొన్ని చోట్ల తమకు వాటా ఇస్తేనే దుకాణాలు తెరుచుకోవాలని కింది స్థాయి నాయకులు పెద్ద నేతల పేర్లు చెబుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని లైసెన్స్‌దారులు ఎక్సైజ్ శాఖాధికారుల వద్ద తమ గోడు వెళ్ల బోసుకుంటున్నారు. కొత్త మద్యం షాపులు తెరుచుకునేందుకు సమయం కావాలని వేడుకుంటున్నట్లు సమాచారం.

● బెల్టు షాపుల కోసం ఊరూరా పోటీ..

జిల్లాలో బెల్టు షాపుల కోసం పోటీ పడే వారి సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో మద్యం షాపులను దక్కించుకున్న వారి చుట్టూ పలువురు ప్రదక్షిణలు చేస్తున్నారు. మద్యం షాపు కోసం దరఖాస్తు చేసుకుని లక్షలు పోగోట్టుకున్న వారు బెల్టు షాపులు తమకు ఇవ్వాలని కోరుతున్నారు. మద్యం దుకాణాల లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అధిక శాతం మందికి నిరాశే మిగిలింది, ప్రతి దుకాణానికి దాదాపు 50 వరకు దరఖాస్తులు పడగా ఒక్కరికే షాప్ దక్కింది. మిగిలిన 49 మంది నిరాశే మిగిలింది. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు ప్రాంతాల్లో ఓ కూటమి నాయకులు దరఖాస్తు చేసుకోగా కనీసం ఒక్క షాప్ కూడా దక్కలేదు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న కొందరు సిండికేట్‌గా ఏర్పడి పదుల సంఖ్యలో టెండర్లు వేస్తే వారికి మొండి చెయ్యి మిగిలింది. సర్వత్రా మద్యం షాపుల జోలికి వెళ్లి చేతులు కాల్చుకున్నామనే నిరాశ కనిపిస్తోంది. వాటిని అధిగమించేందుకు బెల్ట్‌షాపుల కోసం ఆరాట పడుతున్నారు. లైసెన్స్‌ను మద్యం షాపుల యజమానుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరి కొందరు రాజకీయ నాయకుల సిఫారసు చేయిస్తున్నారు ఈ మేరకు తమ మద్దతుదారులకే వీటిని ఇప్పించాలని కూటమి నాయకులు ఉత్సాహం చూపిస్తున్నారు.

ఖమ్మం వాసులపై కేసు నమోదు

కర్నూలు క్రైమ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన మనోహర్, విజయలక్ష్మి, సురేష్, వేణు, సునీత, మరికొంత మందిపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన వెంకన్న అనే మసాల దినుసుల వ్యాపారి రూ.26.31 లక్షలు వసూలు చేసినట్లుగా బాధితుడు ఫిర్యాదు చేశారు. బాధితుడు వెంకన్న మసాల దినుసుల వ్యాపారం చేస్తుంటా డు. ఖమ్మం జిల్లాకు చెందిన మనోహర్, విజయలక్ష్మి, సురేష్, వేణు, సునీతలను సబ్ డీలర్లుగా నియమిం చుకున్నాడు. మసాల దినుసులు కొనుగోలు చేసిన తర్వాత నగదును చలానా రూపంలో పేమెంట్ చేశామని నకిలీ చలానాలు పంపారు. ఆ చలానాలు నమ్మిన వెంకన్న వారికి మసాల దినుసులు పంపారు. తర్వాత ఆలస్యంగా అకౌంటులో చూసుకుంటే నగదు జమ కాకపోవడంతో మోసపోయానని గుర్తించి ఈ నెల 7వ తేదీన ఎస్పీని ఆశ్రయించాడు. ఎస్పీ ఆదేశాల మేరకు కేసు విచారించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోరుగడ్డ అనిల్‌పై కర్నూలులో కేసు

కర్నూలు క్రైమ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్‌పై కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు ఉంది. ఈ ఏడాది జూలై 12న ఐటీడీపీ నాయకులు తిలక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం బోరుగడ్డ అనిల్‌ను రాజమండ్రి పోలీసులు అదుపులో తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్రీటౌన్ పోలీసులు కూడా ఆయన్ను కర్నూలుకు తీసుకువచ్చి విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి



కీర్తి (ఫైల్)

నంద్యాల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి వెంకటేశ్వరపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కీర్తి (21) అనే యువతి అక్కడికక్కడే మృతి చెందింది. నంద్యాల ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. వెలుగోడు మండల కేంద్రానికి చెందిన కీర్తి శాంతిరామ్ ఫార్మసీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. పాణ్యంలో ఓ వివాహ వేడుకకు హాజరుయ్యేందుకు గురువారం తన సోదరుడితో కలిసి వెలుగోడు నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. నంద్యాల మండల శివారులోని శాంతిరామ్ మెడికల్ కళాశాల వద్ద ఉన్న జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో వీరి ద్విచక్ర వాహనాన్ని నంద్యాల నుంచి బనగానపల్లెకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో కీర్తి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. సోదరుడికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సజ్జల డ్రామాలు ఆపాలి : సోమిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సజ్జల ఇక డ్రామాలు ఆపాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో వైసీపీ అరాచక పాలన సాగించిందని అన్నారు. జగన్, సజ్జల, వైవీ. విజయసాయిరెడ్డిల అరాచకాలు, అక్రమాలు, వేధింపులు, దోపిడీలు అన్నీఇన్నీ కావని విమర్శించారు. సజ్జల విచారణకు హాజరు కావాల్సిందిగా పోలీసులు నోటీసులు జారీ చేశారని, అది తెలుసుకుని మీడియాను తప్పుబడుతూ సజ్జల కొత్త నాటకాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమౌతున్నాడన్నారు. నాడు జగన్‌కు తప్పుడు సలహాలు ఇస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ధ్వజమెత్తారు. ఇసుక, మద్యం, గంజాయి, మైనింగ్ వంటి మాఫియాల ద్వారా ప్రజల ధనాన్ని సమూలంగా దోచేయడం ద్వారా కోట్లు గడించిన సజ్జల పాపం పండిందన్నారు.

ఢిల్లీలో ఎంపీ బస్తిపాటి బిజీ



కేంద్ర మంత్రులను కలిసిన ఎంపీ బస్తిపాటి

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీ బస్తిపాటి నాగ రాజు ఢిల్లీలో సుడిగాలి పర్యటన చేశారు. గురువారం ఢిల్లీలోని కన్జ్యూమర్స్ ఫోరం, ఫుడ్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అనంత రం కేంద్ర మంత్రులను కలిసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. మొదటగా కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్ సుఖ్ మండవియాను కలిసి కర్నూలు స్టేడియంలో నెలకొన్న సమస్యలను వినతి పత్రం ద్వారా సమర్పించారు. ఆ తరువాత కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసి కర్నూలు, విజయవాడ మధ్య విమా నం నడిపే చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర వినియోగదారులు, వ్యవహా రాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జ్యోషితో పాటు, కేంద్ర హోం వ్యవహారాల శాఖ మంత్రి బండిసంజయ్ ని కలిసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేసేందుకు కేంద్ర మంత్రులు సహకరించాలని కోరినట్లు తెలిపారు.

వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయండి: కలెక్టర్

నంద్యాల కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్లకు వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పల్లె పండుగలో శంకుస్థాపన చేసిన 1026 సీసీ రోడ్లకు వర్క్‌ఐడీ వారీగా వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈనెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో వేగాన్ని పెంచి నిర్దేశించిన లక్ష్యాల్ని పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో పట్టణ ప్రాంతాలలోని 850 గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు రూ.1.94 కోట్లు, అలాగే గ్రామీణ ప్రాంతాలలో పూర్తిచేసుకున్న 80 మంది లబ్ధిదారులకు రూ.25 లక్షలు జమ అయినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ జనార్దన్‌రావు, హౌసిం గ్ ఈఈ హరిహరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నాణ్యంగా పనులు చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఈ వి.రామచంద్రారెడ్డి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయాలని పంచాయతీరాజ్ ఎస్‌ఈ వి.రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం జడ్పీ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆదోని డివిజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ రోడ్ల నిర్మాణాల పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 418 పనులకు రూ.29.42 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. అంతే కాకుండా 25 అప్రోచ్ పనులకు రూ.15.50 కోట్లు అవసరమని, అందులో 11 పనులకు రూ.5.59 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అంచనాలు సిద్ధం చేశామన్నారు. నిర్ణీత గడువు లోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆదోని ఈఈ డీసీ వెంకటేష్, డీఈఈలు రాణి, మనోహర్ రెడ్డి, రంగస్వామి, చంద్రశేఖర్, ఏఈఈలు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం

- రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి



వాల్మీకి జయంతి వేడుకల్లో ధర్మ సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయమని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి జాతికి సన్మార్గాన్ని చూపిన మహనీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆర్‌ఈ రాఘవేంద్ర, పట్టణ టీడీపీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, ప్యాపిలి మండల టీడీపీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, ఎర్రిస్వామి గౌడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధితురాలికి బంగారు నగలు అందజేత

నంద్యాల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న బంగారు నగలు బాధితురాలికి గంటల వ్యవధిలో నంద్యాల పోలీసులు అందజేశారు. నంద్యాల మండలం రైతునగరం గ్రామానికి చెందిన శైలజ హైదరాబాద్ నుంచి నెల్లూరుకు బయల్దేరిన ఏఆర్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణించింది. రైతునగరం వద్ద దిగే సమయంలో ఆరు తులాల బంగారు ఆభరణాలు గల తన బ్యాగ్‌ను మరిచిపోయింది. ఆ తరువాత నంద్యాల త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో సీఐ సూర్యమౌళి విచారణ చేపట్టి పోగొట్టుకున్న బ్యాగును 24 గంటల్లోపల బాధితురాలికి అందజేశారు.

హోం మంత్రిని కలిసిన డోన్ న్యాయవాది

- అక్రమంగా కేసులు పెట్టాడని సీఐపై ఫిర్యాదు

డోన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో డోన్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కృష్ణప్రసాద్ హోంమంత్రి అనితను గురువారం కలిసి అక్రమంగా న్యాయవాదులపై కేసులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తనపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. టీడీపీ డోన్ మండల అధ్యక్షుడు, న్యాయవాది శ్రీనివాసులు యాదవ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచక్షణారహితంగా కొట్టారని ఫిర్యాదు చేసినట్లు న్యాయవాది కృష్ణ ప్రసాద్ తెలిపారు.



హోంమంత్రి అనితను కలిసిన న్యాయవాది కృష్ణప్రసాద్

సీఐ దాడిపై టీడీపీ సీరియస్

- శ్రీనివాసులు యాదవ్‌ను పరామర్శించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు
- ఘటనపై ఆరా తీసిన సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్

డోన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు, న్యాయవాది శ్రీనివాసులు యాదవ్‌పై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేసిన వ్యవహారంపై రాష్ట్ర పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. ఆ మేరకు శ్రీనివాసులు యాదవ్‌ను పరామర్శించి భరోసా కల్పించి రావాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌ను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు యాదవ్ ఆదేశించారు. దీంతో గురువారం మండలంలోని వెంకటనాయునిపల్లెకు వెళ్లి పోలీసుల దాడిలో గాయపడిన శ్రీనివాసులు యాదవ్‌ను టీడీపీ నాయకుల బృందం పరామర్శించింది. రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున, మాజీ ఎంపీపీ ఆర్‌ఈ రాఘ వేంద్ర, ప్యాపిలి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య తదితరులతో కలిసి టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ బృందం శ్రీనివాసులు యాదవ్‌ను పరామర్శించింది. పోలీసులు దాడి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల పార్టీ అధ్యక్షులు రామసుబ్బయ్యతో పాటు పలువురు నాయకులు డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ దారుణంగా అవమానించి దాడి చేసి గాయపరిచారని జిల్లా పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ముందు గోడు మొర పెట్టుకున్నారు. సీఐను సస్పెండ్ చేయక పోతే పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని తేల్చి చెప్పారు. తొందరపడి ఎవరూ ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, తప్పనిసరిగా న్యాయం జరుగుతుందని మల్లెల రాజశేఖర్ భరోసా ఇచ్చారు. పోలీసు అధికారి ఎందుకు అలా దాడి చేశారన్న విషయంపై విచారించి నివేదిక ఇవ్వా లని పార్టీ అధిష్టానం కోరిందని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి దాడి వ్యవహారాన్ని తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు యాదవ్ తన దగ్గరకు తీసుకు రావాలని ఆదేశించారని, మీ సమస్యను నేరుగా ఆయన ముందు చెప్పుకోవాలని మల్లెల రాజశేఖర్ సూచించారు. తప్పనిసరిగా పార్టీ అధిష్టానం న్యాయం చేస్తుందని, ఇందులో ఎలాంటి అపోహలు వద్దని మండలాల పార్టీ అధ్యక్షులకు భరోసా ఇచ్చారు. మొత్తానికి పోలీసులు టీడీపీ నేతపై దాడి వ్యవహారం ఆర్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకోవడంతో ఏం జరుగుతుందోనన్నది సర్వత్రా చర్చగా మారింది. పరామర్శించిన వారిలో నాయకులు ఆలా మల్లికార్జునరెడ్డి, మల్లెంపల్లి జయన్న యాదవ్, సర్పంచ్ రామిరెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, మిద్దెపల్లి గోవిందు ఉన్నారు.



శ్రీనివాసులు యాదవ్‌ను పరామర్శిస్తున్న మల్లెల రాజశేఖర్, సుబ్బారెడ్డి తదితరులు

నంద్యాల
నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వర్షం.. నష్టం


మిడుతూరులో మొక్కజొన్న ధాన్యం చుట్టూ నీరు

నందికొట్కూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు నందికొట్కూరు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైన్లు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి వర్షపు నీరు వెళ్లడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, మున్సిపల్ కమిషనర్ బేబి కలిసి హాజీ నగర్ లో నీట మునిగిన కాలనీలను పరిశీలించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి భారీవర్షం కురిసింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలో 72.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. పారుమంచాల వద్ద ప్రధాన రహదారిపై ఇసుకవాగు ఉప్పొంగి ప్రవహించింది. వాడాల, రేగడగూడూరు నుంచి నందికొట్కూరుకు ఉదయం వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. దీంతో నందికొట్కూరు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు బస్సులు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు, రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


నందికొట్కూరులో నీట మునిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, కమిషనర్

మిడుతూరు: మిడుతూరు మండల పరిధిలో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మొక్క జొన్న రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తూ కన్నీరు మిగిలించింది. కల్లాల్లో ఆరేసిన పంటను కాపాడుకోలేక రైతులు అవస్థలు పడుతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి
'పల్లె పండుగ'లో ప్రజాప్రతినిధులు


మండ్లెంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి

శ్రీశైలం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సుండిపెంట గ్రామంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్స వాల్లో భాగంగా గురువారం సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి శిలా ఫలకాలను ఆవిష్కరిం చారు. పల్లె పండుగలో భాగంగా నియోజకవర్గంలో సుమారు 20 కోట్లు మంజూరు అయ్యాయని వాటిలో సుండిపెంట గ్రామానికి రూ.3 కోట్ల 20 లక్షలతో గ్రామంలోని పలు కాలనీలు వెస్టన్ కాలనీ, ఎమ్మార్వో ఆఫీస్, కాకులసెంటర్, అక్కమ్మ సెంటర్ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మీడియాతో మాట్లాడుతూ గతంలో నీటి పంపిణీ కోసం రూ.17 కోట్ల రూపాయలను మంజూరు చూయిస్తే వాటిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్యే మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులలో అనుకున్న ప్రగతికి బాటలు వేశామని అన్నారు. సుండిపెంట గ్రామాన్ని పర్యాటక రంగంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, సీఎం చంద్రబాబుకు శ్రీశైలం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉందని ఆయన తెలిపారు. స్థానిక యువతకు ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

జూపాడుబంగ్లా: గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల నాయకుడు గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. పల్లె పండుగలో భాగంగా మండ్లెంలో రూ.68 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి ప్రారంభించారు. సర్పంచ్ కృపమ్మ, ఎంపీడీవో గోపీ కృష్ణ, పీఆర్ ఏఈ బషీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర, ఏపీవో గౌరిబాయి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ పద్మావతమ్మ, టీడీపీ నాయకులు తిరుపతిరెడ్డి, జయరామిరెడ్డి, వార్డు సభ్యులు మధు, వెంకటేశ్వర్లు, అల్లబకాష్ పాల్గొన్నారు.

పగిడ్యాల: నెహ్రూనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణా నికి భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు లోకానందరెడ్డి, రామిరెడ్డి, ఎంపీటీసీ మోహన్, గ్రామ నాయకులు ఆర్.రామస్వామి, హేమసుందర రాజు, ఫరూక్ బాషా, విజేయుడు, నరసింహారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: పల్లెపండుగలో భాగంగా ఎ. కోడూరులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, సర్పంచ్ జ్ఞానాభరణం, టీడీపీ నాయకులు వడ్డు మధు సూదన్‌రెడ్డి, దేరెడ్డి శ్రీనివాసరెడ్డి, చిన్న లింగారెడ్డి, మల్లేశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, శివకుమార్, నాగేశ్వర రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

మహానంది: మసీదుపురం, నందిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఎంపీపీ యశస్విని, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి చంద్రమౌళీశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొక్కెరంచలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, ఉప సర్పంచ్ కరీముల్లా, నాగంపల్లి శ్రీనివాసులు, పీసీ రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

గోస్పాడు: జిల్లెల్ల, నెహ్రూనగర్ గ్రామాలలో పల్లెపండుగలో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, నాయకులు చంద్రశేఖరరెడ్డి, సదాశివారెడ్డి, వెలుగొండారెడ్డి, నారాయణరెడ్డి, చిన్ననరసింహ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వెలుగోడు: వేల్పనూరులో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణా నికి భూమి పూజ చేశారు. సర్పంచ్ సర్దార్ మియ్యా, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'రద్దు చేయాలి'

గడివేముల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒకటి, రెండు తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు ఈనెల 21 నుంచి 6 రోజుల పాటు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణా కార్యక్రమాన్ని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరులతో మాట్లాడారు. నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో మండల కేంద్రాల్లో, డివిజన్ కేంద్రాలో శిక్షణ ఇవ్వాలన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు మానపాటి రవి, ఆవుల మునిస్వామి, మహబూబ్‌బాషా, నాగన్న పాల్గొన్నారు.

నేటి నుంచి ఉప సర్పంచ్‌లకు శిక్షణ

పాణ్యం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని 19 గ్రామ పంచాయతీల ఉపసర్పంచ్‌లు, పంచాయతీ వార్డు సభ్యులకు రెండు రోజులపాటు రిఫ్రెషర్ శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 18, 19 తేదీలలో ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్‌ను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

రేపు 'అన్న క్యాంటీన్' ప్రారంభం

ఆత్మకూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల అన్న క్యాంటీన్‌ను శనివారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రారంభించనున్నారు. ఆగస్టులోనే ప్రారంభిం చాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా పడింది. దీంతో శనివారం ప్రారంభించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ

నంద్యాల కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల బొమ్మలసత్రం ఏరియాలోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం మహాగణపతి, దత్తాత్రేయ, శ్రీకృష్ణ, శ్రీవల్లి సమేత సుబ్రహ్మణ్యస్వామి, షిరిడీ సాయినాథ, నందీశ్వర విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, డాక్టర్ రామకృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు రాజగోపాల్ రెడ్డి, సినీ నటుడు సాయికిరణ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


వాల్మీకికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

శ్రీశైలం, అక్టోబరు 17(ఆంధ్ర జ్యోతి): సుండిపెంట గ్రామంలోని రామాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలను శ్రీశైలం మండల వాల్మీకి సేవా సంఘం ప్రతినిధులు, స్థానిక వాల్మీకులు ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హాజరయ్యారు.

ఆత్మకూరు: అర్బన్ కాలనీలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి వారు పూలమాలలు వేసి పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా, కమిషనర్ రమేష్‌బాబు, వాల్మీకి సంక్షేమ సంఘం నాయకులు ఉన్నారు.

పాణ్యం: మండలంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాణ్యంలోని తహసీల్దారు, టీడీపీ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, టీడీపీ, వాల్మీకి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండలంలో వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు.

జూపాడుబంగ్లా: మండలంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. తరిగోపుల గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించే విషయంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొనడంతో పోలీసుల బందోబస్తు మధ్య నిర్వహించారు.

మహానంది: మండలంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మిడుతూరు: చింతలపల్లి, మిడుతూరు, పీరుసాహేబ్‌పేట, సుంకేసుల, కడుమూరు తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

నంద్యాల రూరల్: మండలంలోన వాల్మీకి జయంతి వేడుకుల నిర్వహించారు. అధికారులు, టీడీపీ, వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: ఎర్రగుంట్లతో పాటు మండలంలోని గ్రామాల్లో వాల్మీకి జయంతిని నిర్వహించారు. అధికారులు, టీడీపీ, వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

వెలుగోడు: మండలంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. మోత్కూరు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

గడివేముల: గడివేముల, గడిగరేవుల గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో వాల్మీకి జయంతిని నిర్వహించారు. అధికారులు, టీడీపీ, వాల్మీకి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి'


మాట్లాడుతున్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 17 ఆంధ్రజ్యోతి: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో 175 అసెంబ్లీ స్థానాలలో నంద్యాల అసెంబ్లీ 7వ స్థానంలో నిలిచిందని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు తెలిపారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో జిల్లాల వారీగా నంద్యాల జిల్లా 8వ స్థానంలో నిలిచిందన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు గురించి(కార్యశాల కార్యక్రమం) గురువారం పార్టీ ఆదేశాల మేరకు డోన్, శ్రీశైలం, నందిరొట్కూరు, పాణ్యం అసెంబ్లీ పరిధిలోని ముఖ్య నాయకులతో కల్లూరు విశ్వహిందూ పరిషత్ హాలులో సమావేశం నిర్వహించా మని చెప్పారు. ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో 25వేలు పైగా సభ్యత్వం నమోదు చేసినట్లు తెలిపారు. కార్యకర్తలు కొట్టే చంద్రశేఖర్, బాలముని, శేఖర్ పాల్గొన్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి: మంత్రి



అధ్వానంగా ఉన్న కైప- సంకలాపురం రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కైప-సంకలాపురం రోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం పూర్తి అధ్వానంగా ఉన్న కైప-సంకలాపురం రోడ్డును ఆయన పరిశీలించారు. అనంతరం రూ.1.80 కోట్లు ఎన్ ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరు చేయించామన్నారు. ఈపనులను త్వరలో పూర్తి చేయాలని మంత్రి జనార్దన్‌రెడ్డి పీఆర్ డీఈ నాగశ్రీని వాసులును ఆదేశించారు. కైప గ్రామంలో సీసీ రోడ్డు, కాలువలు నిర్మించాలని మహిళలు మంత్రిని కోరారు. అనంతరం పొదుపు మహిళలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు కైప రఘునాథరెడ్డి, రామ్మో హన్ రెడ్డి, అక్బర్, వెంకటేశ్వర రెడ్డి, సుదర్శ న్‌రెడ్డి, శివారెడ్డి, సుబ్బారెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, మనోహర్‌రెడ్డి, సత్యశేఖర్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, నాగేంద్ర, సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో వెంకటరమణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఏఈలు వెంకటమరణ, కరీముల్లా పాల్గొన్నారు.

'రంగస్వామి' సినిమా పోస్టర్ ఆవిష్కరణ

బనగానపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రంగస్వామి సినిమా పోస్టర్‌ను రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ సినిమాలో ప్రధాన పాత్రధారి మారుతీసాకా రాంను బీసీ ప్రత్యేకంగా అభినందించారు. ఈచిత్ర సినీ నిర్మాత, దర్శకుడు నరసింహాచారి మాట్లాడుతూ ప్రధాన పాత్రధారులగా గురుస్వామి, నరసింహాచారి, బనగానపల్లె ప్రభుత్వ పశువైద్యశాల డాక్టర్ మారుతీ సకారం, మీనాక్షిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాధురి, సహస్ర, మమత, జబర్దస్త్ నటులు జీవన్, దుర్గారావు, కర్నూలు గిడ్డయ్య, నంద్యాల ఈశ్వర్, చిత్రం శ్రీను, పల్సర్ బైక్ ఝాన్సీలు సినిమాలో నటించినట్లు దర్శకులు తెలిపారు.

మంత్రి దృష్టికి విద్యుత్ సమస్య

కొలిమిగుండ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చొరవతో మండలంలోని బెలుంశింగవరం గ్రామం ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఏర్పడిందని గ్రామ టీడీపీ నాయకులు దొనపాటి శంకరరెడ్డి, కట్టుబడి రామ్మోహన్ చెప్పారు. గురువారం మంత్రిని కలిసిన నాయకులు బెలుంశింగవరం సమస్యలను మంత్రి దృష్టికి తీసుకవచ్చినట్లు తెలిపారు. కాలనీలోని విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారని తెలిపారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

డోన్/డోన్ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి వాల్మీకి నాయకులు గురువారం పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. వాల్మీకుల మనోభావాలను గౌరవిస్తున్న సీఎం చంద్రబాబుకు వాల్మీకులంతా రుణపడి ఉంటారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వాల్మీకి సంఘం నాయకులు వలసల రామకృష్ణ, భాస్కర్ నాయుడు అన్నారు. వలసల గ్రామంలో రామకృష్ణ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో వాల్మీకి సంఘం నాయకులు గోవింద్, శ్రీరాములు, నాగేంద్ర, తిరుపాల్ నాయుడు, శ్రీను, ఆదినారాయణ, ఆర్మీ రామయ్య, మాధవకృష్ణ, నాయకులు ఆర్మీ రామయ్య, శివరామకృష్ణ, మల్లికార్జున, రామాంజి, మద్దయ్య, లాలప్ప, కృష్ణమూర్తి, రాము, రఘు, మధు, విజ్ఞ, మల్కిష్ నాయుడు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణం, గ్రామాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని గిద్దలూరులో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటాన్ని గ్రామోత్సవం నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని కాకరవాడ గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. వాల్మీకి దేవాలయం చుట్టూ పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. సర్పంచ్ పల్లె మోహన్, ఆంజనేయులు, తిరుపాలు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరంలో వాల్మీకి చిత్రపటానికి వాల్మీకి నాయకులు పూజలు చేశారు. చిత్రపటంతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. సుబ్బయ్య, హుసేనీ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలోని గ్రంథాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు గ్రంథాలయాధికారి బషీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రిటైర్డు హెచ్‌ఎం శ్రీరాములు పూజలు చేశారు. విజయభాస్కర్‌రెడ్డి, యాగంటయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, షరీఫ్, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

● బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలో వాల్మీకి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించి గ్రామ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం సంఘం నాయకులు రామతీర్థం రామయ్య, పిక్కి మిద్దే మద్దిలేటి, తలారి సుధాకర్, పత్తికొండ మధు, తలారి నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే యనకండ్ల, బనగానపల్లెలో, టంగుటూరు లో జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సుబ్బారెడ్డి, గోపాల్ రావు, యాగంటీశ్వరుడు, ఓబయ్య, రఫీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని గ్రామాలతో పాటు శింగనపల్లెలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. జయరాముడు, సుదర్శన్, ప్రసాద్, గుర్రప్ప, చిన్నన్న, శ్రీనివాస్, శ్రీరామ, రమణ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లలో వాల్మీకి ఐక్య పోరాట సమితి మండల సమితి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, అన్నదానం చేపట్టారు. గ్రామోత్సవం నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు గోపాల్, జనసేన నాయకులు పెద్దయ్య ఆధ్వర్యంలో మరోచోట జయంతి వేడుకలు నిర్వహించారు. మీర్జాపురంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించగా, డా.కిరణ్‌కుమార్, బాలహుస్సేన్‌నాయుడు, రామచంద్రుడు, శివుడు, పూజల్లో పాల్గొన్నారు. గొర్విమానుపల్లెలో సర్పంచ్ రామాంజనేయులు, జగన్, బందార్లపల్లె, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో ఆయా గ్రామా కమిటీల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

బేతంచెర్ల: నంద్యాల రహదారిలోని వాల్మీకి ఆలయంలో సంఘం నాయకుల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. నాయకులు రాముడు, మురళి, బ్రహ్మనాయుడు, శ్రీనివా సులు, టైలర్ రాముడు, మనోహర్, రామకృష్ణలు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు.



డోన్‌లో వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న నాయకులు



రుద్రవరంలో వాల్మీకి చిత్రపటంతో ర్యాలీ



కొలిమిగుండ్లలో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న నాయకులు

చంద్రబాబుతోనే గ్రామాభివృద్ధి: ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. బూరుగుల గ్రామంలో గురువారం నిర్వహించిన పల్లెపండుగ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయితీలను పూర్తి నిర్లక్ష్యం చేసిందన్నారు. అయితే చంద్రబాబు పంచాయ తీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ప్రతి గ్రామంలో కూడ సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్, యువ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, పీఆర్‌ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, అలేబాదు పరమేష్, లక్ష్మీనారాయణయాదవ్, మాధవరంస్వామి, శివారెడ్డి, సుదర్శన్, రామక్రిష్ణారెడ్డి, హేమంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నిక్రిష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.



బూరుగులలో పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల

నలుగురిపై కేసు నమోదు

బేతంచెర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్‌కు చెందిన వడ్డె పుష్పావతి అనే వివాహితను అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్న భర్త, అత్తమామ, ఇద్దరు ఆడపడుచులపై కేసు నమోదైనట్లు ఎస్ఐ రమేష్‌బాబు గురువారం తెలిపారు. హనుమాన్‌నగర్‌కు చెందిన పుష్పావతితో అదే కాలనీకి చెందిన వడ్డె నాగరాజుతో వివాహమైంది. అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని మహిళ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈవోఆర్డీగా సతీశ్‌కుమార్‌రెడ్డి

బనగానపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండల ఈవోఆర్డీగా సతీశ్‌కుమార్‌రెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బనగానపల్లె గ్రామ పంచాయతీ ఈవోగా పనిచేస్తున్న సతీశ్‌కుమార్‌రెడ్డిని ఈవోఆర్డీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

ఉయ్యాలవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): 18 నెలల చిన్నారిపై కుక్కలు దాడి చేసి గాయపరచిన ఘటన ఉయ్యాలవాడ మండలం మాయలూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జయరాముడు, లత దంపతుల కుమారుడు అరవింద్ గురువారం ఆరు బయట ఆడుకుంటుండగా కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. కుటుంబ సభ్యులు గమనించి కుక్కలను తరిమేశారు. బాలుడి మెడపై బలమైన గాయాలు కావటంతో బాలుడికి ఉయ్యావాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విజయ డెయిరీలో రూ.800 కోట్ల అవినీతి

- త్వరలో వివరాలు బయటపెడతాం
- టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీలో దాదాపు రూ.800 కోట్ల స్కాం జరిగిందని.. అవినీతిని వెలికితీసి బాధ్యులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకునేలా చేస్తామని ఆళ్లగడ్డ టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం మాట్లాడిన మాటలకు ఆయన గురువారం కౌంటర్‌గా పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఎన్నో డెయిరీలు, సొసైటీలు మూతపడుతున్న తరుణంలో నంద్యాల ఎంపీగా భూమా నాగిరెడ్డి నాయకత్వంలో డెయిరీ 25 సంవత్సరాలు లాభాల బాటలో నిర్విరామంగా కొనసాగిందన్నారు. రూ.3 లక్షలపైన ఎటువంటి పనులకైనా టెండర్లు పిలవాల్సినప్పటికీ కమీషన్ల కోసం నామినేటెడ్‌గా పనులు అప్పగించి డెయిరీ నిధులు స్వాహా చేశారని ఆయన ఆరోపించారు. గతంలో విజయ డెయిరీలో అవినీతి జరిగిందని భావిస్తే గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారని విఖ్యాత్‌రెడ్డి ప్రశ్నించారు. అధికారులను ప్రలోభపెట్టి, డైరెక్టర్లపై, భూమా కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేయించి, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి చైర్మన్ కుర్చీలో కూర్చున్నారని ధ్వజమెత్తారు. గడిచిన ఐదేళ్లలో ఇసుక దోచుకున్న అప్పటి ఎమ్మెల్యేకు ఫైన్ విధించినప్పుడు ఎక్కడున్నారని, ఎందుకు మాట్లాడలేకపోయారని అన్నారు. ఆళ్లగడ్డలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో చైర్మన్ బరిలో ఉన్నామంటూ భూమా కుటుంబానికి, ఎస్వీ కుటుంబానికి మద్దతుగా నిలిచిన వ్యక్తులను ప్రలోభపెట్టి అనంతరం ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి డెయిరీ చైర్మన్‌గా వెళ్లి వాళ్ల నమ్మకాన్ని సొమ్ము చేసుకున్నాడని విమర్శించారు. కుటుంబంలోని ఆడపిల్లల గురించి మాట్లాడితే సహించేది లేదని.. నోరు అదుపులో పెట్టుకోవాలని విఖ్యాత్‌రెడ్డి అన్నారు.

భారీ వర్షాలకు కూలిన మట్టిమిద్దెలు

చాగలమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండంలో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మట్టిమిద్దెలు కుప్పకూలాయి. గురువారం చాగలమర్రి గ్రామంలోని నాగులకట్ట వీధికి చెందిన జింక ఉసేన్‌వలి మట్టిమిద్దె కూలి ప్రమాదం తప్పింది. ఆ సమయంలో ఇంటిలో నివసిస్తున్న కుటుంబ సభ్యులు వరండాలో నిద్రించడంతో పెను ప్రమాదం తప్పిందని అన్నారు. ఇంటిలో ఉన్న వస్తువులు ధ్వంసమై రూ.3 లక్షల దాక నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తోడెండ్లపల్లెలో మూడు మట్టిమిద్దెలు, మల్లేవేములలో హరిప్రసాద్‌కు చెందిన మట్టిమిద్దె కూలిపోవడంతో గృహోపకరణాలు దెబ్బతిన్నాయి. 2 రేకుల షెడ్లు కుప్పకూలిపోయాయి. చాగలమర్రి గ్రామంలోని మూడవ సచివాలయ పరిధిలో మూడు గృహాలు పాక్షికంగా దెబ్బతినడంతో వీఆర్వో శారద, కార్యదర్శి మనోజ్‌కుమార్ వారికి నోటీసులు జారీ చేశారు. పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

కూలిన మట్టిమిద్దెల పరిశీలన

చాగలమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో భారీ వర్షాలకు కూలిన మట్టిమిద్దెలు, రేకుల షెడ్ల బాధిత కుటుంబాలను గురువారం టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీడీపీ నాయకులు కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తామన్నారు. టీడీపీ నాయకులు మౌళాలి, అనిఫ్, రామతీర్థం, నాగూర్‌వలి ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన పెంచాలి

డోన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంచాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సూచించారు. పట్టణంలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి విగ్రహం వద్ద డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం హైవే పెట్రోలింగ్ వాహనాన్ని ఎమ్మెల్యే కోట్ల జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హైవేపై నిరంతరం నిఘా ఉండేందుకు పెట్రోలింగ్ వాహనాలు దోహదపడుతాయన్నారు. హైవేపై ప్రమాదాలను కట్టడి చేసేందుకు నియమ నిబంధనల పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలన్నారు. డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, రూరల్ సీఐ రాకేష్, ప్యాపిలి సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

బనగానపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చెర్వుపల్లె గ్రామానికి చెందిన అక్కమ్మ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని మహిళను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన తలారి మద్దిలేటి రైల్వే అండర్ బ్రిడ్జి కింద సారా విక్రయిస్తుండగా పట్టుకున్నారు. గురువారం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని విక్రేత మద్దిలేటిని అదుపులోకి తీసుకుని డోన్ కోర్టులో హాజరు పరచగా.. రిమాండ్‌కు ఆదేశించిందని ఏఎస్ఐ వెంకటనారాయణ తెలిపారు.